కథానిక :

# రాజామణి

## శ్రీ తెన్నేటి సూరి

నాజూకైన లేతపూదారంగు—వాటిని 'ప్యారీ శాండల్స్' అని గావల్నంటారు. ఆ పాదరక్షలు మనదేశంలో తయారయ్యేబాపతు కాదు; వాటిని ఉత్పత్తి చెయ్యటానికి, చాలా అధునాతనమైన యంత్రసహాయముండాలి. అవి యీకాయకిని 'ప్యారిస్'నుంచి విమానంలో దిగిన సరుకు. మెత్తగా, హాయిగా, నిగనిగలాడుతూ, ఎంతో సుందరంగా వున్నై. అసలా చర్మం సాగసే వేరు. పూర్వార్ధగోళంలో చెప్పుల పరిశ్రమ ఎంత మహోన్నతస్థానానికి అభివృద్ధి చెయ్యబడిందో, ఆ చరిత్రంతా ఆ చెప్పుల జతలో చదవొచ్చు. తొడుక్కుచూసి, వాటి సుఖసౌందర్యాలను అనుభవించి, అవగతం చేసుకోవలిసిందేగాని, వాటి గొప్పతనం సంస్తుతించి చెపితే తీరేదిగాదు. అవి కొనాలంటే సామాన్యులవల్లయ్యేదిగాదు—ఏ జమీందారీయో,-కనీసం, ఒక చిన్న మొకాసా అన్నా వుండాలి-'జమీందారీ రద్దుబిల్లు' రాకుండా.

అసలు, ఆ రకం పాదరక్షలమ్మే షాపులోకి మనం వెడితే, అక్కడున్న ఆంగ్లో-ఇండియన్ పడుచు మనవంక ఆ పాదమస్తకం, యేగాదిగా చూస్తుంది,—ఆ షాపులో వున్న గొప్పరకం సామాన్లు ఖరీదుచెయ్యగల హోదా వున్న ఘరానా మనుషులమో కాదోనని. ఆ పిల్లకి మనం నచ్చమనుకోండి—వెంటనే, అక్కడున్న కుర్రకుంకకి చెయ్యూపేస్తుంది—మనకేం గావాలో కనుక్కోమని; లేదా, మనకే ఊపేస్తుంది—బయటికి పొమ్మని. ఆ షాపులోకి రాజామణెమ్మగారే వెళ్ళిందనుకోండి—ఆ షాపు ప్రొప్రైటరే, స్వయంగావచ్చి, ఆవిణ్ణాహ్వానించి, తన ప్రైవేటురూములోకి తీసికెళ్ళి మర్యాద చేస్తాడు. రాజామణెమ్మగారికీ, తక్కిన సామాన్య ప్రజానీకానికీ వున్న భేదమేమిటో అర్థమైందనుకుంటాను.

ఆవిడ గౌరవమర్యాదలకీ, సంఘంలో ఆవిడకున్న ప్రముఖస్థానానికీ చిహ్నం ఆ చెప్పుల జత. ఆ మహనీయ పాదరక్షలు ధరించిన వారైశ్రీమతి రాజామణిగారు. గజగమనంగా, 36 వ వార్డు వెంట బయలుదేరి, 29 నెంబరు ఇంటి వాకిట్లో ఆగారు—

అయినా...ఒక్క చెప్పుల సంగతే వివరించి వదిలెయ్యటం, అదేమంత బాగుండదు. వారి సంపూర్ణ మూర్తినీ, జీవిత వ్యాసంగ వివరాలనూ టూకీగా మనవి చేసుకుంటాను.

రాజామణెమ్మగారు, ఆ పట్నంలో వున్న 'సద్ధర్మప్రచారిణీ సంఘం' కార్యదర్శి; గొప్ప సంఘసంస్కారిణి. చాలా నిర్నిద్రంగా పని చేసే చురుకైన మనిషి. ఒక్క సంస్కారిణే కాదు—ఇంకా చాలా; ఆ పట్నంలో వున్న చెప్పుకోదగ్గ అన్ని ప్రజోద్ధారక వ్యవస్థల్లోనూ, ధార్మిక సంస్థల్లోనూ ఆవిడకి సభ్యత్వం వుంది. అనాదిగా ఏకార్యమైన సంస్కారసాంప్రదాయం గల వంశంలో పుట్టుకొచ్చిన మనిషేమో-యెదటి వాళ్ళలో యే చిన్న మెత్తు కళంకమున్నా ఆవిడ సహించేదికాదు.

పూరేళ్ళని వేటాడ్డం మీరు చూశారో లేదో తెలుసునా?—చక్కని మెత్తటి పచ్చిక బయల్లు చూసి, వేటగాడు ఆ గడ్డిమీద, హాయిగా నిమ్మళంగా, ఆనందంగా కూర్చుంటాడు పిల్లనగ్రోవి వూదుతూ. పూరేడు పిట్టలకి సంగీతమంటే మహా చెడ్డ రసపిచ్చ. మురళీరావం వాటి నరనరాన్నీ కంపిల్ల జేస్తుంది. క్రమంగా వాటికి పిచ్చెత్తుకొస్తుంది. చుట్టూ గడ్డిలో దాక్కున్న పిట్టలన్నీ నెమ్మదిగా తలలు బయిటికి రిక్కబెట్టి...కొంచంగా పైకొస్తై; ముందు భయం భయంగా బెదురుతూ, దూరదూరంగా నిల్చుంటై. కాని ఆ మురళీధ్వని వాట్ని నిల్చోనీదు. బలవంతాన ఆకర్షించి ముందుకు పడేలా లాగేస్తుంది; ముందు ముందుకొస్తాయి. మరీ రసపిచ్చ రకం, మరింత దగ్గిరకొచ్చేస్తూ వుంటై. వేటగాడు వేణునాదంలో లీనమైపోయినట్టు, శిలా ప్రతిమలా, ఎంత నిశ్చలంగా కనపించుతున్నా, కన్నేసి, వాటికంట కనిపెడుతూనే వుంటాడు—ఆ మందలో మరీ ఒళ్ళు తెలియకుండా స్పృహ తప్పి ఆమోమయమై పోతున్న పక్షిని. ఉన్నట్టుండి ఆదమరుపున గప్పున పట్టేస్తాడు—ఆ పూట ఫలహారానికి.

పొంచి, కన్నేసి, పసికట్టి ఆరకం పిట్టని తనిపెట్టి, ఇప్పుడు గప్పున పట్టే సెయ్యడానికే రాజామణి ఆ 29 నెంబరు ఇంటికొచ్చింది.

శ్రీమతి పాదరక్షల సంస్తుతి మనవి చేశాను. ఇక ఆవిడధరించిన ఆ బెనారస్ చీరా, జాకెట్టా, ఆ చేతిసంచీ అవన్నీ కూడా ఒకదానికొకటి సమ్మేళనంగా, అదే ఊదారంగులో, ఒకదానికొకటి తీసిపోని హుందాలో మొత్తం ఆవిడగారి గౌరవప్రపత్తులకు తగిన దర్జాలో వున్నయ్.

అవన్నీ చాలా పరిశుభ్రంగానూ, ఆవిడగారి భూషితవిశుద్ధ వస్త్రమాలాల నిష్కళంక చరిత్రకు ప్రతిబింబాలుగానూ వున్నయ్. అసలు మలిన మనే భావనే ఆవిడస్వభావానికి వ్యతిరేకం. మణెమ్మగారు ధరించే దుస్తులన్నీ ఎప్పటికప్పుడు మల్లెపువ్వల్లా వుతికి ఇస్త్రీ చేసి వుంచాలిసిందే నెలకు అరవైరూపాయల జీతం తీసుకుంటూ (నాడింటికాడే తిండి కొచ్చి) అహోరాత్రాలూ ఇంట్లోనే వుండి చాకిరీ చేస్తూవుండే ఆ చాకలికుర్రాడు వాటి సంగతంతా చాలా జాగ్రత్తగా చూస్తూ వుంటాడు.

ఇలా, శ్రీమతి ధరించే వస్త్రమాల్యాభరణాదుల దగ్గిర్నుంచీ, పీల్చే గాలిదాకా, సర్వం, స్వచ్ఛందంగానూ, ఘరానాగానూ, హుందాగానూ వుంటై. అవన్నీ ఆవిడగారి గౌరవనీయమైన పవిత్రజీవితానికీ, చలిమంచులా ఘనీభవించి, నిష్కల్మష పావనాకృతిలో వున్న, లవలేశమైనా మాలిన్యమంటని, ఆవిడగారి అంతరాత్మకీ ప్రతి చిహ్నాలు.

ఆవిడగారి అంతరాత్మ ఒకటే కాదు; ఆవిడ చేసే ప్రతికార్యమూ కూడా అలానే పవిత్రంగా వుండి, శ్రీమతి ఔన్నత్యానికి దోహదం చేస్తూ, ఆవిడకి గర్వకారణమౌతూ వుంటై. ఇంతెందుకు—ఒక్కమాటలో మనవి చెయ్యాలంటే, ఆవిడ విడిచే ప్రతినిశ్వాసమూ వాయుగర్భంలోకి వ్యాపించి ఆపట్నవాసపు నడివీధులన్నిటినీ పునీతం చేసి పారేస్తోందంటే మరేమీ అతిశయోక్తి కాదేమో!

ఆరోజు బుధవారం కావటంవల్ల ఆవిడ యథాకార్యక్రమంగా, నైతిక ప్రచార దండయాత్రకు ఆపట్నంమీద దాడి వెడలింది—ముఖ్యంగా, బీదజనం నివసించే ఆ 36 వ వార్డు మీదికి.

ఆవిడగా రొచ్చి పడే వేళైందని అనుకుంటూనే వుంది మాలతి మళ్ళా తను ఆ క్షోభంతా విని గుండెలు చీలుకోదల్చలేదు. క్రిందటివారం తన గుండెల్లో పడ్డ గాయాలు, ఇంకా తిన్నగా మానవన్నా బట్టలేదు.

వీధితలుపు చప్పుడు కాగానే అసహ్యంగా, ఆవేపు ఒకచూపు చూసింది. సమాధానం చెప్పకుండానే, లోపలిసావిట్లోకి వెళ్ళిపోయి, ఆ కవిగారు శ్రాంతిగా అద్దెకి పుచ్చుకున్న గది దగ్గిరికి పోయి తలుపు కొట్టింది.

ఆయన, రచయితగా ప్రతకాలనే ఆశయానికి బలైపోయిన ఓక వ్యర్థజీవి జీవితమంతా దగ్ధపటలం చేసుకుని, ఆ పత్రికకో కథా, యీ పత్రికకో కథా వ్రాస్తూ, ఇచ్చినవారిచ్చీ, లేనివారు తొంటచెయ్యి చూపించి, ఫకీరై దేశాలవెంట తిరుగుతూ వుంటాడు. ప్రస్తుతం మకాం ఈ పట్నం. పెద్ద అద్దె ఇచ్చుకోలేక ఆ పేదవాళ్ళు నివసించే వీథిలో మాలతి అక్కావున్న ఆ 29 వ నెంబరు ఇంట్లో ఒక చిన్నగది అద్దెకి తీసుకుని కాలక్షేపం చేస్తున్నాడు. గంటగంటకీ కాఫీ తాగటం మినహా ఆయనకి భోజనప్రసక్తిమీ వున్నట్టు కనుపించేది గాదు. ఇరవై నాలుగు గంటలూ, ఏదో వ్రాసుకుంటూనే వుండేవాడు. ఆయన రూపురేఖావిలాసాలూ, ఆయన వేషం చూస్తే వాళ్ళందరికీ నవ్వొచ్చేది జాలీ వేసేది. కాని ఆయన నిరాడంబరజీవితం, ఆయన మంచితనం, కలివిడీ,—ఎంత క్లిష్ట సమస్యనైనా ఫెళ్ళున విరిచి, లోపలున్న కుళ్ళునంతా బహిర్గతం చేసే—ఆయన తెలివితేటలూ, విజ్ఞానమూ చూసి, ఆ స్వల్పకాలంలోనే, ఆయనంటే భయం, భక్తీ, గౌరవ, ప్రేమాకూడా ఏర్పడ్డయ్ వాళ్ళందరికీ.

మాలతి ఆయన వ్రాసుకుంటున్న గది తలుపు కొట్టి, "మీకోసం ఎవరో వొచ్చారండీ!; రాజామణిగారట; ఏదో 'సధర్మప్రచారిణీ సంఘం' కార్యదర్శిగారుట" అంటూ గోణిగేసి పెరటి దొడ్లోకి వెళ్ళిపోయింది.

ఆయన 'ఏవిటే,'అంటూ చివాల్న లేచి పేక అవ్వాయి కాల్చి వొదిలినట్టు రివ్వున ముందు హాల్లోకి దూసుకొచ్చి వీథి తలుపులు తెరిచాడు. రాజామణి ఆ మని షని మాట మరిచిపోయి, గబగబా కరచాలనం చేసేశాడు. ఆవిడకి గప్పున చెక్కిలెక్ర బడ్డయ్. ఇంగ్లీషులో అనేసేశాడు—"మిమ్మల్ని కలుసుకోటం సంతోషం"

మళ్ళీ తెలుగులో,—"నిజంగా చాలా సంతోషం. ఇప్పటికే చాలా ఆలస్యమైపోయిందనుకుంటాను. ఈ ప్రపంచం ప్రళయమైపోకుండా వుంచటానికి, మనమంతా కలిసి ఆలోచించి, ఐకమత్యమే ఏదో ఒక మహత్కార్యం చేసివుండాలిసింది. పరిస్థితి విషమించి, ఇప్పటికే చాలా అధ్వాన్నంగా తయారైంది; ఈ భూగోళం, పాడైపోయి మరీ తప్పటు నడక నడుస్తోందండీ, పెనవడి!...చాలా విచారకరం"

మణెమ్మగారిని నెమ్మదిబట్టకుని, గబగబా తన గదిలోకి పడుగెట్టిపోయి తలుపు దగ్గిరేశాడు ఆవిణ్ణోక ఓటికుర్చీమీద బుజాలట్టుకు కూలేసి. ఆవిడ కెదురుగా, తనూ మరో కుంటి కుర్చీమీద కూర్చున్నాడు. ఆవిడ మాట్లాడుతుందనుకుని—జాగ్రత్తగా విని అర్థం చేసుకునే నిశ్చలభంగిమలో చెవులు దోరబెట్టుకుని సిద్ధంగా కూర్చున్నాడు. కాని, ఆవిడ అలానే పన్నెండుసేపు దపకుండా మౌనంగా కూర్చుంది. కవిగారికి ఆశ్చర్యమేసింది.

"తమరు దయచేసిన కార్యమేమిటో..."

"ఆ పిల్లతో మాట్లాడ్డానికొచ్చాను—"

"ఏ పిల్లా?—"

"ఇక్కడ...ఆ...చెడిపోయిన పిల్ల..."

"చెడిపోయినపిల్లా! ఏం చెడిపోయిందీ?—"

సమాధానమేం జెప్పాలో గుక్కతిరక్క మణెమ్మ తికమకపడుతోంది.

"ఇక్కడెవరూ చెడిపోలేదే!"

"ఆ...అమ్మాయి.. మాలతి లేదూ..."

"ఆహా.. నేనూ—మేమూ—ఇక్కడెవరూ-మాలతిని గురించి ఈ రకంమాటలు వాడమే!—అరె! నాకు తెలియదే!—నిజంగా చెడిపోయిందా యేమిటండీ?—బాగానేవుందే!. ....ఏమండీ —తెలియక అడుగుతానూ— చెడిపోయిన పదార్థం క్రింద, ముద్దలేసి గోడలు పారెయ్యానే పారేశారుగదా—ఆ పిల్లని చూడ్డానికి మళ్ళా యెందుకొచ్చారండీ, పనిగట్టుకుని?—

ఈ వెక్కిరింపు సంభాషణ ఆవిడకి మొహంలో కొట్టినట్టు అవమానం గానే వుంది. కాని శాంతి వహించింది నిబ్బరంగా, నెమ్మదిగా అర్థం చెయ్యాలని ప్రయత్నించింది. ధర్మ ప్రబోధం చేసి నైతికంగా ఆ పిల్లకు దారి చూపటానికి వొచ్చాననీ, తను 'సద్ధర్మ ప్రచారిణీ సంఘం' కార్యదర్శిననీ, ఆ సంఘం, ఆ పట్నంలో, ఆ రకం పాపం మీద, అజమాయిషీ తీసుకుంటుందనీ, ప్రత్యేకం ఈ 36వ వార్డుకు తను బాధ్యత వహిస్తున్నాననీ, ఈ వార్డులో వున్న, పతితలకందరికీ తన సందేశాన్నందజేసి సన్మార్గాన పెట్టడానికి అహోరాత్రులూ పనిచేస్తున్నాననీ చెప్పింది. మాలతిని పిలిపించి, తనకు ఒప్పగింత చేయించవలసిందిగా కోరింది.

"ఆఁ!.. అన్నట్టూ...తమ రిప్పుడేమిటే ఆ పిల్లకి అందజేస్తామన్నారూ?—కొంచెం మతిమరుపు లెండి, మళ్ళీ అడుగుతున్నాను, క్షమించండి."

"నైతిక సందేశం—"

"మీరు!—ఆ అమ్మాయికి?—"

తన పవిత్ర జీవితాన్నే ఆశంకిస్తున్నాడేమోనని, రేచిక్కుతుకొచ్చు—

"ఔను, ఆ అమ్మాయికి—ఎవరి గ్గావాలిస్తే వాళ్ళకి—"

కవిగారు—'స్విచ్' వేసిన 'ఎలెక్ట్రిక్ బల్బ్'లా ఒక్కసారిగా 'రప్పు' మని ఉత్తేజితుడై—

"సర్వమానవులకూ నైతిక సందేశం సంతర్పణగా!!—గొప్ప విషయం; గర్వపడాల్సిన విషయం...తమవంటి మహా వ్యక్తితో సన్నిహితం లభించినందుకు నిజంగా చాలా గర్వపడుతున్నాను. తమ రాకకు, ఈ పామరుడు కళ్ళు కాయలుకాచి పోయేలా యుగయుగాలుగా నిరీక్షిస్తున్నాడు.—సుదినం!—చాలా సుదినం!—తమ దర్శన భాగ్యం లభించటం, నిజంగా ఇవ్వాళ పర్వదినం!! జన్మ తరించిపోయింది—

"తమ సందేశం నాకెంతో అమూల్యం! అసలు నా గోడేమిటో తమకు మనవి చేసుకుంటాను"

"చూడండి—ఈ ప్రపంచం, అంటే ఈ భూగోళం వుందా అండి—దాన్నీ, మళ్ళ డొంకలు బట్టి పాడైపోకుండా, సరైన దారి చూపించీ—అంటే తారునో ద్దెక్కించీ—విధవతారునో ద్దెమిటిలెండి మళ్ళీ—సిమెంటురోడ్డెక్కించీ, తమవెంట ముందుకు తీసుకుపోవాలని తహతహపడే మనుషులు కొందరుంటారు. వాళ్ళైతే "రండి రండి" అని అరుచుకుండూ ముందు ముందు పోతూనేవుంటారు గానీండీ, వెనక్కి తిరిగి చూసుకుంటే మటుకు, వెంటొస్తున్నవాళ్ళెవరూ, ఫరుగైనా కనిపించక—కాళ్ళు చల్లబడి గడ్డకట్టుకుపోతై అప్పుడుగాని వాళ్ళకి తెలిసిరాదు—ఇంతిలావు ప్రపంచాన్నీ, చచ్చిన గేదూలా, తమవెంట యీడ్చుకుపోవటం—తమ తాహతుకు మించిన పనని.

"ఆజాతిలో, నేనూ వొకణ్ణి; నాలో ఏదో ఒక గొప్పలోపం వున్నట్టుంది మణెమ్మగారూ! విజ్ఞానం, నడిపీథిలో బాకాగొంతుతో పెద్దపెట్టున అరుస్తూనేవుంటుంది—కాని ఎవళ్ళూ ఖాతరీ చెయ్యరు. నా తిప్పలుకూడా అదే తీరుగా వుంది. నెత్తీ నోరూ కొట్టుకుని, 'రండిరా బాబూ' అని ఎంత గోలపెట్టానను కున్నా ఏమిటి!—ప్చ్! పురుగైనా కదిలా రాదే! చెపితేనమ్మరు తలో లేదో—

"అసలో రహస్య మున్నట్లేవుందండీ, మణెమ్మగారూ!—ఒకడేమో దారిమాపుతానంటే, కళ్ళు మూసుకుని, వాడివెంట గొర్రెలమందలా పోవటమంటే, ఈ జనానికి మహా చెడ్డ అసహ్యమల్లేవుంది!!—

"ఆఁ!...అన్నట్టూ—తమ రేదో మార్గం చూపించటమన్నారూ...ఎలా చూపిస్తారూ? మీ విధాన మేమిటో నేను తెలుసుకోవచ్చునా? ఎలా ప్రారంభిస్తారు? ఎక్కణ్ణుంచి? మీ మూలసూత్రాలేమిటే? ఇంతకీ, అసలు మీరు తీసుకుపోదల్చిన ఆ పరమావధేమిటి?"—

"హిందూమత సాంప్రదాయాను కూల్యమైన, పవిత్రజీవితం" పెలిగ్రాంలాంటి ఒకపాటి సమాధానం; —ణాకాసు, అలా కన్నం పెట్టగానే ప్లాట్ ఫారం టికెట్టు చెకోన ఉండి డబ్బాలో నంచి క్రింద బడ్డట్టు—ఆ చివరిప్రశ్న తగలంగానే, లోగడే అచ్చయి, సిద్ధంగావున్న కార్డుముక్కలా ఆ సమాధానం, 'టలీ'న ఊడిపడ్డది.

"చాలా బావుంది!—కాని, చూడండి మణెమ్మగారూ!—ఆ చెడిపోయిందన్నారే, ఆపిల్లకి,...హిందూమతం సంగతీ, పవిత్రజీవితం బోగట్టా, అవన్నీ బాగా తెలుసే?—అయినా హిందూమతమంటారూ—అదే మీ, మీ రుస్వయంగా, ఇవ్వాళ క్రొత్తగా కనిపెట్టిన బాపతేమీకాదే. సంఘంలో ఐక్యత నిర్మించటానికి ఉపకరణంగా, దాన్ని ఎప్పుడో ఇక్ష్వాకుల నాడే ప్రయోగించి ప్రయత్నించి చూచారే! ...అదేమిటో మీ సొంత సామ్మెట్టు, మీసొంత పనులకోసం ఉపయోగించుకోటం, నాకు మటుకు పసేమీ బాగుండ్లేదు—"

"నా సొంతపనేమిటీ?—సంఘంకోసం ఉద్యోగిస్తున్నాను— మేము సంస్కారులం—"

[16 వ పేజీ చూడుడు]

# వివాహము-స్త్రీపురుషులు

(9 వ పేజీ తరువాయి)

స్త్రీసమాజంనుంచి మరికొందరు మరొక ప్రశ్న వేస్తున్నారు. తల్లికి పిల్లవాడిని పెంచుకునే ఆర్థికశక్తి స్వతంత్రంగా ఏర్పడ్డప్పుడు పొందే హక్కు న్యాయశాస్త్ర మూలకంగా ఎందుకు ఉండకూడదు అని. అప్పుడు వారికి వివాహబంధం ఎందుకు? అది కేవలమూ స్త్రీని పురుషునికి బానిసగా జేయటం తప్ప అన్య మౌతుందా? ప్రభుత్వంగానీ, సంఘంగానీ భర్తను కోరే యువతికి భర్తను చూపలేకపోవటం వల్ల శక్తివంతమైన మాతృత్వం ఉన్న స్త్రీ వ్యభిచరించటం దోషమా?—అయితే ఈ తప్పు సంఘానిదా? ప్రభుత్వానిదా? వ్యక్తిదా?

పురుషులకంటే స్త్రీలు విశేషంగా ఉన్న దేశంలోగానీ, జాతిలోగానీ, సంఘంలోగానీ, స్త్రీ లందరికీ భర్తలు దొరకటం చాలా కష్టం. వివాహ విషయంలో ఆధునిక స్త్రీ మానసిక స్థితి లోతెరిగిన ఒక వేత్త కొన్ని అభిప్రాయాలిచ్చాడు. "వంధ్యాత్వం చట్టసమ్మతము చేయవచ్చును. స్త్రీలలో మానసికాభివృద్ధికి మాతృత్వాన్ని వహించాలని కొందరు కోరుకుంటారు. కొందరు భర్తఅంటే మనస్సు అంగీకరించకపోయినా పిల్లలమీద అపేక్షవల్ల వివాహం చేసుకుంటారు. పిల్లలు కావాలని ప్రతి స్త్రీ కోరుతుంది. కానీ—అందుకోసం పురుషుడికి దాస్యం చేయటానికి అంగీకరించదు" అని.

అయితే పిల్లలు ఎలా వస్తారు? పెంచుకోవచ్చును, లేదా మరో స్త్రీ పిల్లలను దొంగిలించవచ్చును. ఇతరుల పిల్లలను పెంచుకున్నా దొంగిలించినా తృప్తి కలుగకపోవటము మానవలోకానికి సహజగుణం. ఇందులో రక్తసంబంధం కనిపించదు. ప్రసవవేదన లేదు. ఆత్మీయత లేదు. ఏమి సంతృప్తి? ఎక్కడి సంతృప్తి?

లోకంలో కొందరికి సహజంగా కామోద్రేకం ఎక్కువ. కొందరికి తక్కువ. కొందరిలో కామం మధ్యేమార్గాన్ని అనుసరిస్తుంది. ఎవరిలో కామం తక్కువగా ఉంటుందో వారిని జాతిశాస్త్రజ్ఞులు ఊనకాములు (Infra-sex) అని వ్యవహరిస్తారు. ఇటువంటివారికి కామోద్రేకం విశేషంగా ఉన్న వాళ్ళను చూస్తే ఈర్ష్య కలుగుతుంటుంది. అందువల్ల దాన్ని తగ్గించటానికి ఎంతో తంటాలు పడతారు. లోకంలో స్త్రీ పురుష సంబంధంలో వచ్చే నిబంధనలూ, తప్పులూ, పుక్కిటి పురాణాలూ అన్నీ ఈ ఊనకాముల మూలంగా కలిగేవేనని ఒకమతంవారి అభిప్రాయం. అంతే కామానికి సంబంధించిన విధినిషేధాలు పనికి రావని అభిప్రాయంకాదు. ఊనకాముల అశక్తతవల్లకూడా లోకానికి కొంత మేలు కలిగింది.

పూర్వకాలం మతప్రవక్తలు గుర్తించినట్లు కామశక్తిని గమనించినవాళ్లు అరుదు. విచ్ఛేదన (Divorce) మాట ఎత్తకుండానే ఎన్నో ఆటంకాలు కల్పించారు. జీవన విధానంలో అనేక నిష్ఠానియమాలను ఏర్పరచి నేడు విచ్చలవిడిగా తాండవించే కామానికి కళ్ళాలు బిగించినారు. కామశక్తిని సమస్తమూ భగవంతుని మీద కేంద్రీకరించే ఆధ్యాత్మిక ప్రపంచాన్ని సృజించారు.

క్రైస్తవ మతం పావిత్ర్యాన్ని ప్రథమంలో అంగీకరించి కేవల నీతివాదులు ఏమంటున్నారో గమనిద్దాము. వివాహ విధానాన్ని సంపూర్ణంగా మార్పు చేయటంకంటే ఏ కొద్దిమంది వ్యక్తులో మిగిలిన సంఘం కోసం బలి కావడం మంచిదని వారు అభిప్రాయ పడుతున్నారు. సంఘానికి శ్రేయస్సు అందువల్ల లభించేటట్లయితే కొందరిని త్యాగం చెయ్యమని కోరటంలో తప్పుండదు.

అయితే అప్పుడు మరో ప్రశ్న బయలు దేరుతుంది. జీవితపర్యంతమూ బ్రహ్మచర్యాన్ని అవలంబిస్తే మానసికంగా కానీ శారీరకంగా కానీ ఏమన్నా ప్రమాదం సంభవిస్తుందా? అని. ఇటువంటి ప్రశ్న ఒక శతాబ్దానికి పూర్వం కలిగినట్లయితే దానికి 'ఏ ప్రమాదమూ లేద'ని వెంటనే సమాధానం వచ్చి ఉండేది.

ఇది కేవలమూ శాస్త్రీయ యుగము. ప్రాచీన యుగంలో మతవక్తలు సంఘంలో ఉచ్చ స్థితిని పొంది ఉన్నా రన్న సంగతి లోకప్రసిద్ధము నేడు ఆ స్థితిని—ప్రజా యుగంలో—వైద్యులు పొందినారు. యథాతథంగా బ్రహ్మచర్యం వల్ల ఎటువంటి ప్రమాదమూ లేదు. కానీ అది కొందరికి ఉపకరిస్తుంది. కొందరికి ఉపకరించదు—అని వైద్య శాస్త్రజ్ఞులు చెపుతున్నారు. కామశక్తి విశేషంగా లేని వాళ్ళు బ్రహ్మచర్యాన్ని అవలంబిస్తే ప్రమాదం లేదు కాని తద్వతిరేకులు స్త్రీ సంభోగాన్ని అరికట్టితే కామోన్మాదులు (Sexual Neurotics) అయినా అవుతారులేదా ముష్టిమైథునానికి అలవాటు పడుతారు; ఇది వైద్యుల అభిప్రాయము. అందువల్ల బ్రహ్మచర్యం అందరికీ మంచిదని గానీ, చెడ్డదని గానీ నిర్ణయించడానికి అవకాశం లేదన్నమాట.

అంతే కాకుండా, స్త్రీ సంబంధం లేనంత మాత్రాన ఒక వ్యక్తి కామరహితుడని కానీ బ్రహ్మచారి అనిగానీ అనటానికి వీలు లేదని జాతి శాస్త్రజ్ఞులంటున్నారు. ప్రాచ్య గ్రంథాలు కూడా అదే విధంగా పలుకుతున్నారు. బ్రహ్మచర్యావలంబకులకు కామసంబంధమైన భావనలూ, కాముక స్వప్నాలూ రాకూడదు. నిజమైన బ్రహ్మచర్యము కేవలము శారీరకభోగంతో ఆగిపోదు. అంటే బ్రహ్మచారి మనస్సులో ఏ విధమైన కామమూ ఉండకూడదు.

హేవ్‌లక్ ఎల్లిస్ మహాశయుడు బ్రహ్మచర్యాన్ని గురించి వ్రాస్తూ ఇలా అన్నాడు "సామాన్యంగా 'చేస్టిటీ' (బ్రహ్మచర్యం) అనే శబ్దం శారీరిక సంభోగాన్ని గురించి మాత్రమే లోకంలో వాడుకలో ఉన్నది. కానీ ఆ శబ్దం అంతమాత్రంతో ఆగిపోదు. అంతకంటే అనంతమైన అర్థాన్ని ప్రతిపాదిస్తుంది" అని. అందువల్ల మత, ధర్మ, వైజ్ఞానిక వివక్ష లేకుండా బ్రహ్మచర్యం ఒక గుణంగానే పరిగణిత మాతూ ఉన్నది. పూర్వకాలపు మత ధర్మాల మీద 'విప్లవం జరిపి స్వేచ్ఛను పొందినాన'ని భ్రమపడే నేటి సభ్యతా ప్రపంచం బ్రహ్మచర్యంమీద దాడి చేస్తూ ఉన్నది. అందుచేత ఒకవంక నుంచీ బ్రహ్మచర్య మేమిటి? మానవులకు కామేచ్ఛ సహజం, దాన్ని తీర్చుకో వలసినదే ననీ, వివాహాది నియమాలను త్రోసిరాజ నవలసిందేననీ వినిపిస్తున్నది. ఏ దేశంనుంచైతే ఈ నినాదాలు వినిపిస్తున్నవో పూర్వం ఆదేశంలోనే కామోపభోగానికి కొన్ని నియమాలున్నట్లు తెలుస్తున్నది. అయితే — కామేచ్ఛను తీర్చుకునే ఇతరఅవకాశాలూ కనిపిస్తున్నవి. కానీ విప్లవం చేసి సాంఘికఆర్థికరాజకీయ స్థితుల్లో మార్పునూ, స్వేచ్ఛనూ పొందిన ఆ దేశం నేడు కామస్వేచ్ఛ (Sex-licence) కోరుతున్నది.

సామాన్య స్త్రీపురుషులలో మిగిలిన అన్నిటితో పాటే కామమూ సామాన్యంగా ఉంటుంది. దానివల్ల ఎటువంటి ప్రమాదమూ లేదు. వైజ్ఞానిక, మానసిక వికాసాల విషయంలో కలిగే తృష్ణవంటిదే అదీ పనిచేస్తుంది. అత్యచ్ఛతాన్ని తెలుసుకోవలెననే ఆసక్తి ఎటువంటిదో కామమూ అటువంటిదే.

నీతిశాస్త్రజ్ఞుడు సంఘం అంగీకరించిన మార్గాలలోనే కామతృప్తిని పొందటము స్త్రీకి గానీ, పురుషునికిగానీ శ్రేయస్కరమని అభిప్రాయ మిస్తాడు. అటువంటి మార్గాన్ని అనుసరించలేని వ్యక్తి దానిని చంపుకోటంగానీ లొంగదీసుకోటంగానీ మంచిదంటాడు. అయితే అటువంటి విధానాన్ని అనుసరించటము ఎంతవరకూ సాధ్యము? అనేది ప్రశ్న.

మనస్సును మార్చుకున్నా—లేక స్నాయువులకు నిస్సత్తువ కల్పించుకున్నా కామము నశించదు. కామాన్ని చంపుకునేందుకు కొందరు కొన్ని క్రీడలు కనిపెట్టారు. దానివల్లకూడా విశేషం ప్రయోజనం కనిపించలేదు. పరిపూర్ణమైన అలసట (Exhaustion) కలిగేనాకా క్షుద్బాధగాని, కామతృష్ణగానీ నిర్మూలితం కాదు. మతవిషయకమైన మనస్తత్వం కొంతగా ఉపకరించవచ్చునేమోగాని, అది లేనివాళ్ళకు కామాన్ని లొంగదీసుకోవటమనేదే లేదు. అటువంటివారు, సంఘంవారి ఆనందానుభవాన్ని అరికట్టితే, స్వీయ-కాములు (auto-erotic)గా పరిణమిస్తారు. దానివల్ల లోకానికి సంఘానికి మరింత తీరని ప్రమాదం సంభవిస్తుంది.

ఉదాత్తమైన ఒక ఆదర్శం ఉంటే కామం లొంగక పోదు. ఆదర్శవిహీనంగా కామాన్ని లొంగదీసుకోటానికి యత్నిస్తే అందువల్ల ప్రయోజనంకంటే ప్రమాదమే విశేషము.

# రాజామణి

(10 వ పేజీ తరువాయి)

"అదే చెప్పొస్తున్నాను—అల్లాంటి యోగ్యతలేవీ మీలో లేవే అని—"

ఈమాత్రం కుదుపు లోగడ ఆవిడ కెప్పుడూ తగల్లేదు. బెంగాల్-నాగపూర్ రైలింజన్ ఢీకొన్న పెట్రోల్‌టాంక్‌లా భగ్‌మని—

"మీ.. ఇష్టవొచ్చినట్టు మాట్లాడుతున్నారు—ఏమిటి మీ ఊహ?—"

"నేను, నాయిష్ట మొచ్చినట్టు మాట్లాడక, వాళ్ళ ఇష్టమొచ్చినట్టూ, వీళ్ళ ఇష్టమొచ్చినటూ మాట్లాడుతానుట గానీండీ, పిచ్చా?—అసలు, నాయిష్టమొచ్చినట్టే మాట్లాడ్డం, అది, నాకో వెధవలవాటులెండి, మొదణ్ణుంచీ—దానికేమిటి గానీండీ—ఆఁ!— అన్నట్టు — ఊహేమిటన్నారు గాదూ?—ఆఁ! ఏ ఊహతో మాట్లాడుతున్నానంటే—ఉండండి చెబుతాను. పిలవని పేరంటంగా, తమరు ఈ ఇంట్లో ప్రవేశించారు—ఏ ఊహతో? సరిగ్గా అదే ఊహనుకోండి—నాదీ, ఓచిన్న నైతిక సందేశం వుంది. కొంచెం మీకు ధర్మోపదేశం చేసి మంచిమార్గం చూపిద్దామని వెధవ పేకు—"

"నాకా? ఏమిటీ!!—"మంటగా అరిచింది.

"ఏమిటా అండీ...ఆఁ!...చెపుతాను. తమరు నికార్సయిన సంఘసంస్కారులు కారని నా పరమ విశ్వాసం. సంస్కారుల కుండవలసిన ప్రాథమికధర్మాలే మీలో హుళ్ళీ. అసలు ప్రాథమిక ధర్మాలేమిటీ?—'దానం, ధర్మం, దయా, సత్యం'—అందులో మొట్టమొదటిది, దానం. ఇప్పుడు పరిశీలిద్దాం. సంస్కరణోద్యమాన్ని చేతిసంచిలో తగిలించుకుని మీ రిక్కడి కొచ్చారు. దోవలో—సిగ్గు దాచుకోటానికైనా చాలక వాలికలైపోయి జానెడు బెత్తెడు చింపులబొంతలు మొలకి చుట్టుకుని, చలికి గజగజలాడుతూ, ఇంచుమించు దిగంబరులై, హోర్న ఘోషిల్లుతూ, గతిలేని అనాథపశువులు, 'ఒక్క దమ్మిడీ పారెయ్య'మని, అంగలారుస్తూ, ఎంతమంది అడుక్కుతినే ఆడపురుగులు, మీ వెంటబడ్డారు! వాళ్ల వంక కన్నెత్తైనా చూశారా?—లేదు. చలికి నరాలు విరుచుకుపోయి చస్తున్న, పాపం, ఆ ముసలిముండకి—మాటవరసకి, మీ బెనారస్‌చీర ఎందుకిచ్చారు గారు?—కేవలం ముంజేతులుతప్ప, రొమ్ముల మీద మరుగ్గా ముడుచుకోటానికి, మరో గత్యంతరంలేక, అవమానంతో ఆటమటించి, కుమిలి కుమిలి యేడుస్తూ, కళ్ళనీళ్ళతో మీ వంక ఆశతో దీనంగా చూసిందే...ఆ బీదపడుచుకి ఈ వాయిలు రవికన్నా పారెయ్యాలిసింది—పోనీ వొళ్ళు ఇలా బైటికి కనుపిస్తున్నా కొంచెం ఆచ్ఛాదనగానైనా వుండేది. అక్కడ పసిబిడ్డని అర్ధాన్లో వేసుకుని, బోసిపోయిన ఆముదంపిడత మీ కడ్డంసాచిందే, ఆ పచ్చిబాలింతకి, చెవులమీద కట్టుకోటానికి, కనీసం ఈ సిల్కు జేబురుమాలన్నా ఎందుకు తగలేశారు గాదూ?—ఒక్కమాటలో చెపుతాను వినండి రాజామణిగారూ. ఈ రోజున నిజంగా, ఈ దిగంబరభారతంలో మీరు నికార్సయిన సంస్కారులే అయివుంటే మొండిమొలతో తిరగాలిసొస్తుంది.

"స్కౌండ్రల్!"—చివాల్న కోపంగా లేచిపోబోయింది.

"ఆగం డాగండి—మీరలా వొట్టినే వెళ్ళిపోడానికి వీల్లేదు. మీ బెనారస్‌చీర మీ రుంచుకుంటే మాని, మీ సందేశమైనా, నాకు పారేసిపొండి—ఆ పిల్ల గొడవ మీ కెందుకు? చెడిపోయిందేమిటి?—"

"ఎంత పాపం జేస్తోంది?—"

"అది మాలతి సొంత విషయం. మీకు సంబంధం యేమిటి? ఆ విషయంలో మీరు జోక్యం గల్గించుకు ముక్కెందుకు దూరుస్తున్నారు?"—

"చుట్టూవున్న మనుషులు సహించేదెలా?"

"ఎవరూ?—ఎందుకు సహించలేరు. ఈ ఇంట్లోవున్న వాళ్ళెవరూ సహించలేకుండా వున్నామని గోలెట్టడంలేదే! మీ దగ్గిరి అలాటి అభియోగ మేదన్నా వొచ్చిందా యేమిటండీ?—అథవా వొచ్చిందే ననుకోండి, ఈ దండనాధికారమంతా తాము స్వయంగా చేపట్టి, కోర్టుబెట్టి, శిక్షలు చెప్పమనీ, గుండెలు చీరమనీ, మీకు, ప్రభుత్వంవారు, ఫర్మానా యెప్పు డిచ్చారు?—పాతమంత్రులా? క్రొత్త మంత్రులా? కాస్త, ఆ తేదీ, ఫైలునెంబరూ, మెమోనెంబరూ దయచేయిస్తారూ?"—

లేచి, గదిలోనుంచి, తప్పించుకుని పారిపోవటానికి ప్రయత్నించింది రాజామణి—కాని ఆ కవిగారు ద్వారానికి అడ్డంపోయి నిల్చున్నాడు.

"ఆగండాగండి! మీ రలా వెళ్లిపోడానికి వీల్లేదు. మీరు నాకు సరైన సమాధానం చెపితేగాని వెళ్ళటానికి వీల్లేదు. పిలవని పేరంటంగా అసభ్యంగా పరాయివాళ్ల పడకగదుల్లోకి రావటం, వాళ్ళకి పేర్లెట్టటం—తగదని యే పెద్దమనిషైనా, కొంచెం మందలిస్తే, గింజుకుని రుసరుసలాడి, కోపంగా లేచిపోవటం—ఏమిటీమర్యాదా మీరూ?

"నాకు తల నేరిసింది; మీకు నెరవలేదు—మిమ్మల్ని కొన్ని ప్రశ్నలడగటానికి నాకు హక్కుంది. మీకీపనికి జీత మేమిస్తారు?—లేక మీగొప్పతనం ప్రదర్శించుకుని రొమ్ము విరుచుకు తిరగట మొక్కటే మీకు ప్రతిఫలమా? ఈ రెంటిలో ఏదైనా మీకు కొంత ప్రతిఫలం, ముడుతోందనే చెప్పాలి. కాని, మీరు... మీసంతోషంకోసం, మీ సంతృప్తికోసం, మీగొప్పతనాన్ని డబ్బావాయించుకోటకోసం—యెవరటి వాళ్లని సత్ప్రవర్తన కలిగివుండమని బజాయిస్తున్నారు. అల్లాంటి బజాయింపు వల్ల, ఇంతవరకు, ఎక్కడైనా, సున్నపాకు తొడిమంత, ప్రయోజనలేశ మేదైనా కలిగిందా చెల్లీ? నిజం చెప్పండి—లేదు. ఎందుకు కలగలేదో నేను చెపుతాను వినండి. మీ బలహీనతెక్కడుందంటే, మనుషులంటే యేమిటో, వాళ్లకుండే బాధలేమిటో, దుఃఖాలేవిటో, వాళ్ళపరిస్థితులేమిటో మీకు తెలియవ్. కనీసం, తెలుసుకుంటానికైనా మీరెప్పుడూ ప్రయత్నించలేదు.

మీకున్న ఆర్థిక స్థయిర్యం, సంఘంలో మీకున్న స్థానం, కంచుకోటల్లా మీచుట్టూ, యీగ వాలనీకుండా కాపాడుతుంటే, పూల సెజ్జల్లో, సుఖమయ జీవితం నెరపుతూ హాయిగా తియ్యతియ్యటి కలలుగంటూ వుంటారు. ఈ జీవితం మీదృక్పథాన్నంతా మార్చి, ప్రపంచం కృత్రిమ వర్ణాల్లో అద్భుతంగా కనిపించేలా చేస్తుంది, రంగద్దాల జోడులోనుంచిలా. ఆ అద్దా లున్నంతసేపూ మీరు సంస్కారిణి అనేపేరు తగిలించుకోటానికి వీల్లేదు బహిన్—"

హడిలిపోయి పచ్చద్దాల చలవజోడు చివాల్న కళ్లమీద నుంచి లాగేసుకుని చేత్తో పుచ్చుకుంది. గిజాటుగా, ద్వారం వేపు నడిచింది. తప్పించుకు పారిపోవాలని. కాని కవిగారు త్రోవ తప్పుకోలేదు. ఇప్పుడాయనకి మరింత దగ్గిరగా నిలబడాలి సొచ్చింది.

"ఆ సుఖమయజీవితం ఒక సాలె గూడు, గ్రహించండి. స్వర్గానికి రోడ్డు మీ రనుకుంటున్నంత పువ్వుల బాటకాదు. మోకాళ్ళ పర్వతం. ఎగబాకటమంటే, బోర్లబొక్కలంగా పడటం, ముక్కు బద్దలుకావడం, నడుములు సడలటం, ఇవన్నీ జరగొచ్చు—"

"వెళ్ళనియ్యండి"—కళ్ళనీళ్ల పర్యంతమై డగ్గుత్తికతో అంది.

"నిజంగా మీ రేమిస్తున్నారు?—మధ్యాహ్నం రెండు గంటలకి 'టీ' తీసుకొని కులాసా కోసం ఇటు పచారుచేసే ఆ కాస్త కాలాన్ని ఇస్తున్నారు."

పక్కగా దూసుకు పారిపోదామని ప్రయత్నించింది. కాని పక్కనున్న బల్లమీద జారిపడి నడుములు కదిలిపోయినయ్—

"అమ్మయ్యో!"—అంటూ, వలవలా బాధగా యేడ్చింది. కవిగారికి జాలేసింది—తలుపు తెరచి—

"ఇక మీరు వెళ్ళొచ్చు—".